క్లుప్తంగా

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



రైతు భరోసా కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

ఉండి: కొత్త ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం యండగండి రైతు భరోసా కేంద్రం వద్ద రైతు సమస్యలపై అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌కు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కిలారి తవిటి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణ

ఆకివీడు: స్థానిక సిద్ధాపురం రైల్వే గేటు వద్ద సోమవారం మట్టి నమూనాల్ని రైల్వే అండర్ పాస్ విభాగం సిబ్బంది సేకరించారు. ఆ ప్రాంతంలోని గంగానమ్మ కోడు మురుగు కాల్వ ప్రవహిస్తున్న ప్రాంతంలో మట్టిని సేకరించారు. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో గంగానమ్మకోడు మురుగు నీరు ఉప్పుటేరులోకి ప్రవహిస్తుంది. దీని సమీపంలో అండర్ పాస్ నిర్మాణం ద్వారా మినీ వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని రైల్వే అండర్ పాస్ విభాగం అధికారులు గుర్తించారు. ఇక్కడ అండర్ పాస్ నిర్మాణం జరిగితే కారులు, వ్యాన్లు, ఆటోలు, మోటారు సైకిళ్లు, సైకిళ్లు, ఇతరత్రా చిన్న వాహనాలు అండర్ పాస్ గుండా వెళ్లే అవకాశం ఉంది. దీని ద్వారా దుంపగడప రైల్వే గేటు, లెవల్ క్రాసింగ్ గేటుల వద్ద వాహనాల రద్దీ తగ్గే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. మూడు గేట్ల వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని, లేకుంటే అండర్ పాస్ వంతెనలు నిర్మించాలని స్థానిక ప్రజలు ఆందోళనలు చేశారు. రైల్వే అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతులందజేశారు. ఆయా గేట్ల వద్ద పలుమార్లు సర్వేలు నిర్వహించిన అనంతరం ఎట్టకేలకు అండర్ పాస్ నిర్మాణానికి మట్టి నమూనాలు సేకరించారు.

పాఠశాలకు దాతల సహకారం అభినందనీయం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు దాతలు గ్యాస్‌స్టౌవ్, కుర్చీలను బహూకరించారు. సోమవారం దాతలు గాదె సుబ్బారావు రూ.4 వేలు విలువ చేసే గ్యాస్ స్టౌవ్, మజ్జి శంకరం కుర్చీలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్‌కు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థులకు దాతల సహకారం ఎంతగానో దోహదపడుతుందని భవానీప్రసాద్ అన్నారు. ప్రభుత్వంతో పాటు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దనాని సూర్యప్రకాష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

28న ఉచిత మెగా వైద్యశిబిరం

పోడూరు: న్యూలైఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పండితవిల్లూరులోని ఐపీసీ చర్చిలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వారిచే ఈ నెల 28న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు మినిస్ట్రీస్ డైరెక్టర్, చర్చి పాస్టర్ జి.సామ్యేల్‌జాన్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ వ్యాధులతో పాటు కార్డియాలజీ, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, క్షయ, ఊపిరితిత్తులు, స్త్రీల విభాగానికి సంబంధించిన వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. ఉదయం 9 నుంచి, మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగే ఈ శిబిరాన్ని పండితవిల్లూరు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తిపై దాడి

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక గ్రామానికి చెందిన ఇనుకొండ మాణిక్యాలుపై అదే గ్రామానికి చెందిన రావూరి పుల్లారావు ఇటుకతో దాడిచేసి గాయపరిచారు. సోమవారం రోడ్డుపై నడచివెళుతున్న మాణిక్యాలుని పుల్లారావు దుర్భాషలాడారు. అదేమిటని ప్రశ్నించినందుకు ఇటుకతో మాణిక్యాలపై దాడిచేయడంతో తలకు గాయాలయ్యాయి. దీంతో మాణిక్యాలు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కాకి శివన్నారాయణ కేసు నమోదు చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పెనుగొండ: ఈపురుపాలెంలో చేనేత కుటుంబానికి చెందిన చిన్నారి సుముఖుల సుచరితపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్యభాస్కర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం సరైన ప్రణాళికతో ముందుకెళ్లి భద్రత కల్పించాలని కోరారు.

తాళ్లూరి ఇందిర మృతి

నరసాపురం: పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత తాళ్లూరి ఇందిర (72) అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. రాష్ట్ర విభజనకు ముందు వరకు ఆమె కాంగ్రెస్‌పార్టీలో చురుగ్గా పనిచేశారు.

ఖరీఫ్ సాగుకు శ్రీకారం



వీరవాసరం మండలంలో సిద్ధమైన నారుమడి

వీరవాసరం: సార్వాసాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. నైరుతి రుతుపవనాలు రైతులతో దోబూచులాడుతున్నాయి. తొలకరి వానలు పలకరించగానే ప్రతి ఏడాది మాదిరిగానే సార్వ సాగుకు నారుమళ్లను జోరుగా సిద్ధం చేస్తున్నారు. వీరవాసరం మండలంలో సుమారు 18 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉండడంతో అన్నదాతలు సాగుకు సన్నద్ధమై నారుమళ్లను ముమ్మరంగా చేస్తున్నారు. జూన్ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో వరి నారు మళ్లను పూర్తి చేసి జూలై మూడో వారంలో వరి నాట్లను నాటుకునే విధంగా రైతులు సన్నద్ధమువుతున్నారు. ప్రతి రైతు నారుమడి తయారు చేసుకోవడానికి ఎకరాకు 5 సెంట్లు చొప్పున దున్ను చేసుకుని దుక్కు చేసుకుని, చుట్టూ చిన్న చిన్న గట్లను వేసుకొని నీరు నిల్వ ఉండకుండా బోధెలను ఏర్పాటు చేసుకుంటున్నారు. నారుమడిలో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకున్న వరి నారుమడుల్లో విత్తనాలు వేసుకున్న 21 రోజులు నుంచి వరి నాట్లను ప్రారంభించుకోవచ్చు అని రైతులు పేర్కొంటున్నారు.

విత్తన శుద్ధి కచ్చితంగా చేయాలి

సార్వా సీజన్‌లో రైతులకు సరిపడా విత్తనాలను, ఎరువులను ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలతో పాటు, ఆర్‌బీకే, ప్రైవేట్ కేంద్రాల్లోనూ అందుబాటులో ఉంచడం జరిగింది. నారుమడిలో విత్తనాలు చల్లుకొని ముందు విత్తన శుద్ధి కచ్చితంగా చేయాలి. ఎకరాకు సరిపడా నారుకు సంబంధించి 20 నుంచి 25 కేజీలు విత్తనాలు అవసరమవుతాయి. విత్తన శుద్ధి చేయడం ద్వారా నాణ్యమైన నారు రావడమే కాకుండా దిగుబడి కూడా బాగా వస్తుంది.

–బి.బాబు, మండల వ్యవసాయ అధికారి, వీరవాసరం

ముమ్మరంగా ఖరీఫ్ నారుమడులు

పాలకోడేరు: మండలంలో సుమారు 11,500 ఎకరాలలో రైతులు వరి సాగు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సుమారుగా 30 శాతం నారు మడులు వేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ ఖరీఫ్ సీజన్ కి సంబంధించి ఎక్కువగా రైతులు నూజివీడు కంపెనీ సంపత్ స్వర్ణ, మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఎంటీయూ 1061 రకాల విత్తనాలను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రైతు సోదరులంతా విత్తన శుద్ధి చేసుకోవాలని, దీని వల్ల చీడ పీడల నుంచి నారు మడులను రక్షించుకోవచ్చునని తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ఉండి: భార్యను కాపురానికి పంపడం లేదంటూ భార్య, బావపై దాడి చేసిన ఘటనలో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీకి చెందిన కరణం భవానీ (దివ్యాంగురాలు, మూగ)కి ఉండికి చెందిన పొంగిలి ప్రసాద్‌కు ఏమిదేళ్ల క్రితం వివాహమయ్యింది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఇటీవల భవానీని ఆమె భర్త కించపరుస్తూ అవమానకరంగా మాట్లాడుతుండటంతో ఆమె నెల రోజుల క్రితం పుట్టింటికి వచ్చేసింది. అయితే సుమారు రెండు రోజుల క్రితం ప్రసాద్ తన భార్యను కాపురానికి పంపాలంటూ పొగిలి దుర్గాప్రసాద్, లలిత, దాసరి దుర్గాదేవి, సాయికుమారి అనే వారితో కలిసి వెళ్లి తన భార్యను కాపురానికి పంపించాలంటూ ప్రసాద్‌తో వారంతా గొడవకు దిగారు. ఈ గొడవలో భవానిపైనా ఆమె అన్న కరణం గోవింద్‌పైనా దాడి చేసి కొట్టారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రీవెన్స్ సెల్‌లో ఒక ఫిర్యాదు

ఆకివీడు: గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో ఒక ఫిర్యాదు అందినట్లు ఎంపీడీవో రాధాకృష్ణ సోమవారం తెలిపారు. స్థానిక దర్మాపుర రెవెన్యూ గ్రామంలో 1.31 ఎకరాల భూమిలో 20 సెంట్లు ఆక్రమణకు గురయ్యిందని స్థానిక నివాసి కోళ్లపర్తి సుబ్రహ్మణ్యదత్తు గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన భూమిని సర్వే చేయించి, హద్దులు నిర్ణయించవలసినదిగా కోరారు. ఫిర్యాదును సంబంధిత అధికారికి పంపిస్తున్నట్లు తెలిపారు.

బహిరంగ వేలం ఆదాయం రూ.68 వేలు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని రెండు మంచినీటి చెరువుల్లో ఒక రోజు చేపలు పట్టుకునేందుకు సోమవారం బహిరంగ వేలంలో రూ.68 వేలు ఆదాయం వచ్చింది. స్థానిక భుజబలరాయుడు చెరువులో చేపలు పట్టుకునేందుకు వల్లభుని నాగరాజు రూ.28 వేలకు, మంచినీటి చెరువులో చేపలు పట్టుకునేందుకు వనమాలి కృష్ణ భగవాన్ రూ.40 వేలకు వేలం దక్కించుకున్నారు. చెరువుల్లోని చేపలను ఒక రోజు పట్టుకునే విధంగా వెంటనే సమాయత్తమవ్వాలని కమిషనర్ జీవీ కృష్ణమోహన్ సూచించారు. బహిరంగ వేలాన్ని నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు నిర్వహించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పాలకొల్లు అర్బన్: వాయుత్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలో పార్వతీ సమేత శివదేవస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సంతాన ప్రాప్తి కోసం కొత్తదంపతులు స్వామివారికి అభిషేకం చేసి ఆలయ ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకస్వామి ర్యాలి శివాజీ, ఈఓ నామాల రంగరాజన్ భక్తులకు సేవలందించారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

వీరవాసరం: జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించి, రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 10 రోజులు కావస్తున్న విత్తనాలకు చేతిలో సొమ్ములు లేక నారుమళ్ల వేసే పరిస్థితి కూడా లేక దిక్కులు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం మంచి మనసుతో రైతులకు రబీ ధాన్యం సొమ్ములు తొందరగా ఇచ్చి రైతన్నలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు పోతుల మృత్యుంజయ, యాళ్ల బండి నారాయణమూర్తి, లింగం సత్యనారాయణ, బాలా విజయ కుమార్, కేతాజ్యోతి బస్సు, పాలా కోటేశ్వరావు, ఆచంట కనకాచలం, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పెట్టొద్దు



ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

భీమవరం: వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పెట్టడం వలన అనేక దుష్పరిణామాలు ఏర్పడుతున్నాయని టెక్నికల్ అడ్వైజర్ ఎం శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ ఇంక్లూడింగ్ బ్లాక్ చైన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అధ్యాపక శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు సంఖ్య విపరీతంగా పెరుగుతోందని అందువల్ల సోషల్ మీడియాలో పెట్టిన సమాచారాన్ని ఎవరైనా చౌర్యం చేసి దానిని ఏ విధంగానైనా ఉపయోగించే అవకాశముందని హెచ్చరించారు. ఇటువంటి తరుణంలో సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీస్ పై అవగాహన ఏర్పరచుకుంటే మన సమాచారాన్ని మనమే దాసుకున్నప్పుడు ఎవరికైనా కావాలంటే వద్ద నుంచి నగదు చెల్లించి కొనుగోలు చేసే అవకాశముంటుందని శ్రీనివాసరాజు చెప్పారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లో అన్ని విభాగాలు సైబర్ సెక్యూరిటీ టెక్నాలజీని అధ్యయనం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కెవీ కృష్ణంరాజు అధ్యక్షత వహించగా సైబర్ సెక్యూరిటీ అడ్వైజర్ ప్రిన్సిపల్ కమలేష్ జోషి, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వి చంద్రశేఖర్, జీఎస్‌విజి శిరీష, రవికిరణ్ వర్మ, డీఎన్ఎస్‌బి కవిత తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కాళ్ల: వర్షాకాలంలో డయేరియా వ్యాధి సోకకుండా ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కాళ్ల ప్రభుత్వ వైద్యులు సరాబు సునీల్ తెలిపారు. కాళ్ల తహసీల్దార్ శ్రీదేవి అధ్యక్షతన డయేరియా వ్యాధిపై అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యులు సునీల్ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో డయేరియా విజృంభిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో పైప్ లైన్లు లీకేజీలు ఉన్న పంచాయతీల్లో తక్షణమే రిపేర్లు చేయాలని తెలిపారు. ప్రతీ రోజు ఓహెచ్ఎస్ఆర్లను క్లోరినేషన్లు చేయించాలన్నారు. డయేరియా లక్షణాలు కనబడినట్లయితే వైద్యులను సంప్రదించాలని తెలియజేశారు. తక్షణమే చికిత్స అందించి వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీవో స్వాతి, మండల పరిషత్ ఏవో ప్రభాకర్, ఈవోపీఆర్డీ భాస్కరరావు, వ్యవసాయ అధికారి జయవాసుకి, పంచాయతీరాజ్ జేఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



పీఎస్‌ఎం గరల్స్ హైస్కూల్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. సోమవరం పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్(పీఎస్ఎం) గరల్స్‌హైస్కూల్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యద్వారానే ఎదైనా సాధించవచ్చునని పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎం శ్యామల, స్కూల్ ప్రధానోపాధ్యాయిని జె సుధారాణి, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ మెరగాని నారాయణమ్మ, కోళ్ల నాగేశ్వరరావు, మెంటే పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఫోరం వార్షికోత్సవం



సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో గోపాలకృష్ణంరాజును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని శ్రీకృష్ణ దేవరాయ సాంస్కృతిక సమితి కల్యాణ మండపంలో సోమవారం సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు నల్లం వెంకటకృష్ణ నాగేశ్వరరావు అధ్యక్షన జరిగిన ఈ సమావేశంలో అక్టోబర్ మొదటి వారంలో సొసైటీ దశాబ్ది ఉత్సవం నిర్వహించాలని, వృద్ధుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలకు నివేదించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. అనంతరం కార్యదర్శి బోనం పాండురంగారావు 2023–24 సంవత్సరంలో ఫోరం నిర్వహించిన కార్యక్రమాలు నివేదించగా, ఫోరం కోశాధికారి కర్రెడ్డి సత్యనారాయణ వార్షిక ఆదాయం, ఖర్చుల వివరాలను సభ్యులకు తెలిపారు. అనంతరం రైతు సంఘం నాయకుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ చెన్నంశెట్టి గణపతిరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేళం దుర్గాప్రసాద్, మట్లపూడి సత్యనారాయణ, వడ్డి నరసయ్య, సయ్యద్ బాజీ, పెన్మెత్స రామకృష్ణంరాజు, వినుకొండ పాండురంగారావు, తాళ్లపూడి గాంధీ, చీమకుర్తి నర్సింహా రావు తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు



మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఉండి: మత్తు భారిన పడితే జీవితం చిత్తవుతుందని చైల్డ్ సేవ్ నెట్ డాన్ బాస్కో జవ జీవన్ బాలభవన్ విజయవాడ కోఆర్డినేటర్ లీలావతి అన్నారు. ఈ నెల 26న అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని చెరుకువాడ జడ్పీ హైస్కూల్‌లో సోమవారం హెచ్ఎం జీవీఆర్‌కే కృష్ణంరాజు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో లీలావతి మాట్లాడుతూ నేటి యువత, విద్యార్థులు చిన్నతనం నుంచి మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. సిగరెట్, గంజాయి, గుట్కా, ఖైనీ, మద్యానిక బానిసయ్యి సమాజ వ్యతిరేక పనులకు పూనుకుంటున్నారని తెలిపారు. చెడు అలవాట్లతో నేరాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు రౌడీషీట్లు తెరిచి, కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. ప్రతీ ఒక్కరూ సామాజిక భాధ్యతగా యువత పెడదారిన పడకుండా తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జీఎం పార్వతీదేవి, కేవీ కృష్ణ, షేక్ గులాజీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



చెరుకువాడ పెదపేటలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ఉండి: ప్రతీ ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థాయికి రావాలంటే చదువుతోనే సాధ్యమవుతుందని నాయకులు తెలిపారు. సోమవారం చెరుకువాడ పెదపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఎంజీ మంగతాయారు అధ్యక్షతన స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు ఎంపీటీసీ సీహెచ్ క్రిష్టాఫర్, కట్టా రాంబాబు, ఉంగరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. అలాగే విద్యార్థుల పట్ల మరింత శ్రద్ధతో వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో యిర్రింకి బుజ్జీ,వార్డు సభ్యుడు బిల్ మోరియా, కోట వెంకటేశ్వరరావు, పడమటి త్రిమూర్తులు, కుచ్చు కృష్ణ, మద్దాల శివ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా చరణ్‌సాయితేజ



కేజీఆర్‌ఎల్ కళాశాలలో చరణ్‌సాయితేజను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం కేజీఆర్‌ఎల్ డిగ్రీ కళాశాల విద్యార్థి జి చరణ్‌సాయితేజ వెస్ట్‌గోదావరి అండర్–19 క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మెంటే రామ్‌మనోహర్ అన్నారు. క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన చరణ్‌సాయితేజను సోమవారం సత్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో విద్యాబోధనతో పాటు క్రీడలకు కూడా అధికప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మెంటే హరనాథ్‌బాబు, తోట రామ్మూర్తి, ఇంటి రామచంద్రమూర్తి, సీహెచ్ వినోదరావు, ఎం వీబీ గంగాధరరావు, బి శ్రీనిధి, షేక్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించాలి

పెనుగొండ: కోడి పందేల దిబ్బ ప్రజలకు సత్వరం తాగునీటి అందించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం పెనుగొండ గ్రామ సచివాలయంలో కోడి పందేల దిబ్బవాసులతో కలిసి వినతిపత్రం అందజేశారు. 2008లో 1130 కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో 600లకు పైగా ఇళ్లు నిర్మించుకొన్నారని తెలిపారు. అప్పటి నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారని తెలిపారు. ఇప్పుడు నీటి సరఫరా నిలిచిపోవడంతో అధికార్లకు ఎన్నిసార్లు విన్నవించుకొన్నా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం తాగునీటిని అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, షేక్ పాదుషా, గుడల వాణి, జక్కంశెట్టి సాయిలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా పాలిథిన్ కవర్ల వినియోగం



పాలిథిన్ కవర్లో వేడి వేడి టీ వేస్తున్న విక్రయదారుడు



పాలిథిన్ కవర్లో ప్యాక్ చేసిన వేడి సాంబారు

యలమంచిలి: పాలిథిన్ కవర్లు వాడకం వల్ల అనేక దుష్పరిమాణాలు ఏర్పడుతున్నా.. వాటిని అరికట్టడంలో అధికారులు విఫలమవుతునే ఉన్నారు. ఏటా పాలిథిన్ కవర్ల వినియోగం పెరుగుతుండటంతో పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. పాలిథిన్ కవర్ల వినియోగంపై నిషేధం ఉన్నా అధికారుల ఉదాసీనత వల్ల మార్కెట్‌లో కవర్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. వీటి వాడకం ఏ స్థాయికి చేరిందంటే టీ సెంటర్లలో టీ, కాఫీ హోటల్స్, కూరల విక్రయాల కేంద్రాల్లో సాంబారు వంటి వేడి వేడి ద్రవపదార్థాలు సైతం పలుచటి పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి అమ్ముతున్నారు. జ్యూస్ సెంటర్లలో కూడా అతి చల్లని జ్యూస్‌లను పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి ఇస్తున్నారు. అతి చల్లని, అతి వేడి పదార్థాలు పలుచటి పాలిథిన్ కవర్లలో వేయడం వల్ల ప్లాస్టిక్ కరిగి ఆహార పదార్థాలలో చేరుతుంది. వాటిని సేవించడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్న ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఉదాసీనత

దశాబ్ద కాలం క్రితం పాలిథిన్ కవర్ల వాడకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధించాయి. ఆ సమయంలో అధికారులు దాడులు చేసి పట్టుకుని అపరాదం రుసుం విధించేవారు. దీంతో యజమానులు తమ దుకాణాల వద్ద పాలిథిన్ కవర్లు ఇవ్వబడవు అనే బోర్డు పెట్టేవారు. అదే సమయంలో అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు గుడ్డ సంచులు పంపిణీ చేశాయి. కాలక్రమేణ అటు అధికారుల్లో, ఇటు దుకాణాల యజమానుల్లో ఉదాసీనరావడంతో పాలిథిన్ కవర్ల వినియోగం పూర్వస్థితికి చేరింది.

ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు

పాలిథిన్ కవర్ల వినియోగం వల్ల మానవుల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా పర్యావరణమూ దెబ్బతింటుంది. పాలిథిన్ మితిమీరి వాడడం వల్ల వాటి మలినాలు మానవ శరీరంలో చేరి అనేక ప్రాణాంతక రోగాలకు దారితీస్తాయి. ఆహార పదార్థాలు తిని పాడేసిన కవర్ల నుంచి వచ్చే వాసనను పసిగట్టి ఆవులు, గేదెలు, కుక్కలు వంటి జంతువులు కవర్లతో వాటిని తింటున్నాయి. దీంతో వాటికి జీర్ణకోశ వ్యాధులు వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయి. వాడి పడేసిన పాలిథిన్ కవర్లు మట్టిలో కరగకపోవడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస దొర

పెనుగొండ: గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, అంటువ్యాధులపై పంచాయతీల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎస్ శ్రీనివాస దొర అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎస్ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులలో వినియోగించుకోవడానికి నాణ్యమైన బ్లీచింగ్, సున్నం, ఫినాయల్, మెలాథియన్, ఎటిట్ సోడియం హైపోక్లోరైడ్, తాగునీటిని క్లోరినేషన్ నిమిత్తం క్లోరిన్ టాబ్లెట్స్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అందుబాటులో పొక్లెయిన్ ఉంచుకోవాలన్నారు. గృహ అవసరాలకు సరఫరా చేసే తాగునీరు క్లోరిన్ పరిమాణం 0.2 నుంచి 0.3 ఉండాలని అన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిన పుడు తాగునీరు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. తుఫానులు, వరదలు సమయంలో దిగువ ఏరియాల ప్రజలను రక్షిత ప్రదేశాలు, సైక్లోన్ సెంటర్ల ఉంచడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లను వరదల నుంచి కాపాడేందుకు సురక్షితంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈవోపీఆర్డీ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిరియాల శ్రీనివాస్ పాల్గొన్నారు.